ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దరహాస్‌కు చోటు

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక జిబిఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎల్‌కేజీ చదువుతున్న దరహాస్ వెంకట సాయి తన ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2022లో చోటు దక్కించుకున్నాడు. 2019 మార్చి 7వ తేదీన జ్యోత్స్న దేవి రామ్ కిషోర్ దంపతులకు దరహాస్ జన్మించాడు. పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందంగా మూడేళ్ల ఎనిమిది మాసాల్లోనే దరహాస్ ప్రపంచంలోని 64 దేశ రాజధానుల పేర్లు 2 నిమిషాల 34 సెకండ్లలో, దేశంలోని 28 రాష్ట్ర రాజధానులు, 8 కేంద్రపాలిత ప్రాంతాల రాజధానుల పేర్లు కేవలం 53 సెకండ్లులో చెప్పి అబ్బుర పరుస్తున్నాడు. అంతేకాక 75 ముక్కలుగా చింపిన ప్రపంచ పటాన్ని, 24 ముక్కలుగా చింపిన ఇండియా పటాన్ని అతి తక్కువ సమయంలో అతికించి అందరిని ఆశ్చర్యానికి గురి చేశాడు. దరహాస్ కనపరిచిన ప్రతిభాపాటవాలను ఈ ఏడాది నవంబర్ 12న ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ గుర్తించింది. తమ పాఠశాల చిన్నారి కనబరుస్తున్న ప్రతిభా పాటవాలకు జిబిఆర్ విద్యాసంస్థల చైర్మన్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) ముగ్ధులై చిన్నారి దరహాసుకు రూ.5 వేలు బహుకరించి అభినందించారు. అభినందించిన వారిలో జిబిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరి ప్రసాద్, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ కామాక్షి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ పెద్దబ్బాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులంలో విద్యార్థినిలకు ట్యాబ్‌ల పంపిణి

విశాలాంధ్ర - కాట్రేనికోన : విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చేస్తూ నూతన సాంకేతికతను విద్యార్థులకు అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాల లకు దీటుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల చైర్మన్ వడ్డీ శ్యాంప్రసాద్ అన్నారు. శనివారం తానే లంక గురుకుల పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ టి. గంగా భవాని ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జానీ, ఉపాధ్యాయులు అమ్మణి, బాల వెంకటలక్ష్మి, జి. వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో మౌలిక సదుపాయాలు కల్పనకు మండల పరిషత్ నిధులతో డ్రైనేజీలు, రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎంపిపి అధ్యక్షుడు కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి పల్లపువీధిలో గల రామాలయం వద్ద మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మండలంలో ఇటీవల కాలంలో రూ.80 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎంపీపీ దుర్గారావు వెంట సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్,పచ్చ రాంగోపాల్, నడింపల్లి సురేష్ రాజు, సిద్ద సూర్యారావు, కామిశెట్టి దుర్గారావు, మాధవరపు వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు .

2 నుంచి టెన్నిస్, క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - గోపాలపురం : మండలంలోని వెల్లచింతలగూడెం గ్రామంలో జనవరి రెండో తేదీ నుండి సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకకమిటీ తెలిపింది. మొత్తం 32 జట్లు పాల్గొంటాయన్నారు. రోజుకి మూడు మ్యాచ్లు నిర్వహిస్తారని, మొదటి బహుమతిగా రూ.1,50,000, రెండో బహుమతిగా రూ.75000, మూడవ బహుమతిగా రూ.30,000 మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.10000, బెస్ట్ బ్యాట్స్మెన్ రూ.5000, బెస్ట్ బౌలర్ రూ.5000 ఉంటుందన్నారు.

నేడు పెంచిన నగదు పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం : ఆదివారం కొత్త పెన్షన్‌లతో పాటు పెంచిన నగదు పంపిణీ చేయనున్నట్లు మండల అభివృద్ధి అధికారి కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కె. రమేష్ విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 299 కొత్త పెన్షన్లు మంజూరు అయ్యాయని వీటితో కలిపి మండలంలో 11580 పెన్షన్లు పంపిణీ జరుగుతుందని అన్నారు. 2023 జనవరి నెల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెంచిన 250తో కలుపుకుని ఒక్కో పెన్షన్ లబ్ధిదారుడికి 2,750 రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతీ నెల మాదిరిగానే ఒకటవ తేదీ ఉదయం నుంచి వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే పెన్షన్ అందజేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలకు, నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రగతి పథంలో ప్రభుత్వం

విశాలాంధ్ర - మండపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ప్రగతివంతమైన పాలన అందిస్తుందని కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ వైసీపీ నేత వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి పేర్కొన్నారు. మండపేట సైదిల్ పేటలోని 11వ సచివాలయంలో 24వ వార్డు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మండపేట పురపాలక సంఘ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సచివాలయం అడ్మిన్ జ్యోతి తదితరులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేక్ ను చైర్ పర్సన్ పట్టాభి చౌదరి, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణలు కేక్ కట్ చేసి అభిమానులకు, సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేగుళ్ళ నారయ్య బాబు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి వర ప్రసాద్, కౌన్సిలర్లు ముక్కా లోవలక్ష్మి దాలయ్య, జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు, శెట్టి కళ్యాణి, మందపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్, వైసీపీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, అడబాల వీరబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలలో ఆదిత్య విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.పావని గాయత్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలలో తెలుగు వక్తృత్వ పోటీలలో ప్రథమ బహుమతి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కెఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలలో పాల్గొన్న పావని తృతీయ స్థానంలో నిలిచి ప్రశంసా పత్రం, జ్ఞాపిక గెలుపొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాధించిన పావని గాయత్రిని డాక్టర్ ఎంఎస్ రెడ్డి, ప్రొ టి. సుధారాణి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు 42 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి. అప్పలరాజు, ఎంపీటీసీ ఎం. వీరబాబు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బర్ల లోవరాజు, జిల్లా శాలివాహన (కుమ్మరి) సంక్షేమ అభివృద్ధి కమిటీ మెంబర్ అనకాపల్లి నూకరాజు, ఉప సర్పంచ్ చంద్రాడ అర్జునుడు, బత్తుల శ్రీను, పల్ల సత్తిబాబు, మురుకుర్తి సుబ్బారావు, హెచ్ఎం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఫ్లెక్సీలు - చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - కాకినాడ : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ఫ్లెక్సీలు నిషేధమని అధికారులు అనేకసార్లు ప్రజలకు ప్రకటనల ద్వారా ప్రచారం చేశారు. ఇది కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నది తప్ప కార్యాచరణ కావడం లేదు. దీనికి నిదర్శనంగా కాకినాడ నగరంలో నూతన ఆంగ్లసంవత్సరాది, సంక్రాంతి పురస్కరించుకుని ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియచేసేందుకు ఊరంతా ఇబ్బడిముబ్బడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటు విధానంలో సరైన నియమనిబంధనలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. అధికారపార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలపడం తప్పేమీ కాదు. కానీ దీన్ని ఆసరాగా తీసుకుని నగరవాసులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. కల్పనా సెంటర్ నుంచి ఆనందభారతి గేటువరకు లారీయూనియన్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ద్విచక్రవాహనదారుల పాలిట శాపంగా మారాయి. 2టౌన్, వైఎస్సార్ వంతెనలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల కారణంగా బాటసారులకు నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ వంతెన ఫ్లాట్‌ఫారం దిగి కిందకు నడుచుకుని వెళితే వెనుక నుంచి ఏ వాహనం మీదకు వస్తుందో ఆ దేవుడికే ఎరుక.

ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు స్తంభాలపై భాగంగా ఏర్పాటు చేసుకుంటే కొంతవరకు ప్రమాదాల బారినుంచి పడకుండా ప్రాణాలు కాపాడుకోవచ్చు.

ఏ నియమ నిబంధనలు ప్రకారం ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారో నగరపాలకసంస్థ అధికారులకే తెలియాలి. ఒకపక్క ప్రజాప్రతినిధులు వేడుకలకోసం ఏవిధమైన ఆర్భాటాలు చేయవద్దని పిలుపునిస్తున్నా కొందరు యూనియన్ నాయకులు, పార్టీ నాయకులు అత్యుత్సాహం చూపడం కొసమెరుపు. ఎవరి మెప్పుకోసమో ఇటువంటి ఏర్పాట్లు చేస్తున్న వారిపై నగరపాలకసంస్థ కఠినచర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా ఈ వ్యవహారం పై జిల్లా కలెక్టర్ కఠినచర్యలు తీసుకుని నగరప్రజలకు రక్షణ కల్పించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంఎఫ్‌డిటి విద్యా సంస్థలు ప్రభుత్వపరం అయ్యే వరకు పోరాడదాం

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం ఎఎఫ్‌డిటి విద్యాసంస్థలు ప్రభుత్వపరం అయ్యేవరకు పోరాడదాం అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన అధ్యక్షతన మలికిపురం పూలే అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కళాశాల ఆవశ్యకతను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలికిపురంలో 1948వ సంవత్సరంలో దాతలు ఏర్పాటు చేసినటువంటి విద్యాసంస్థలను ప్రభుత్వం ఇటీవల జీవో నెంబర్ 12 ద్వారా ప్రభుత్వంలో విలీనం చేయడం జరిగింది. కానీ కొంతమంది ఈ కాలేజీకి సంబంధంలేని వ్యక్తులు దుష్ట ఆలోచనతో ఈ విద్యా సంస్థలను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. రాజోలు నియోజకవర్గ ప్రజలందరూ బడుగు, బలహీన వర్గాల, పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్కువ ఫీజులతో చదవాలంటే ప్రభుత్వ పరం కావలసిన అవసరం ఉన్నందున విజ్ఞులైన వారందరూ విద్యాసంస్థలను కాపాడుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బహుజన సమన్వయ సమాఖ్య కార్యదర్శి ఏఎఫ్‌డిటి విద్యాసంస్థల పరిరక్షణ సమితి నాయకులు గుబ్బల బాబ్జి, కోనసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ రాపాక మహేష్, సామాజికవేత్త ఎఎఫ్‌డిటి విద్యాసంస్థల పరిరక్షణ సమితి నాయకులు గెద్దం ఫిలిప్ రాజు, మాజీ విద్యార్థి సంఘ నాయకులు, పోలిశెట్టి గణేష్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కే మణికంత, టి నవీన్, హరి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ఫ్లెక్సీలు : పలువురి ఆగ్రహం

విశాలాంధ్ర - మండపేట : న్యూ ఇయర్ వేడుకల వేళ మండపేట పట్టణంలో ఫ్లెక్సీల బెడద తల నొప్పిగా మారింది. ఆయా రాజకీయ పార్టీల నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేయ దానికి అక్కడా ఇక్కడా అని చూడకుండా ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు కడుతున్నారు. దేశ నాయకుల విగ్రహాలు, లోకల్ నాయకుల విగ్రహాలు అని చూడకుండా వాటి చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ దగ్గర నుండి ప్రతిపక్ష పార్టీ వరకూ ఇదే రీతిగా ప్రవర్తిస్తున్నారు. కొందరు రోడ్డు మధ్యలో ఉన్న విగ్రహాలను ఫ్లెక్సీలకు గోడలుగా ఉపయోగించి రోడ్లు కనబడకుండా కడుతుంటే, మరి కొందరు దేశ నాయకులు అని చూడకుండా పూర్తిగా కప్పేస్తున్నారు. స్థానిక పెద్ద కాలువ వంతెన వద్ద ఉన్న బీసీలకు ఆరాధ్యుడైన జ్యోతిరావు పూలే విగ్రహం కనబడకుండా టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో బీసీ నాయకులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుపై గుర్రుగా ఉన్నారు. కలువ పువ్వు సెంటర్ లో వైసీపీ నాయకులు సర్దార్ వేగుళ్ల వీర్రాజు విగ్రహాన్ని కనిపించకుండా మున్సిపల్ చైర్ పర్సన్ ఫ్లెక్సీలతో కప్పేసారు. మండపేట మున్సిపాలిటీకి సుమారు నాలుగు దశాబ్దాలు చైర్మన్ గా ప్రాతినిధ్యం వహించి పట్టణ వాసుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకోవడమే కాకుండా సర్దార్ బిరుదు సైతం పొందిన వేగుళ్ల వీర్రాజు విగ్రహానికి కూడా రాజకీయ నాయకులు గౌరవం ఇవ్వక పోవడం ఎంత మాత్రం సబబు కాదని సీనియర్ సిటీజన్లు పేర్కొంటున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న విగ్రహం చుట్టూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ కూడా తీవ్ర అంతరాయం కలుగుతుందని వాహన దారులు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

అధికార పార్టీ కౌన్సిలర్ గగ్గోలు

విశాలాంధ్ర -సామర్లకోట : మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అధికా రులు సచివాలయ సిబ్బంది ఆక స్మిక సెలవులు, పట్టణంలో చేపట్టా ల్సిన అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని అధికార పక్ష కౌన్సిలర్లు ప్రతిపక్షంగా వ్యవహరించి ఎండగట్టారు. తొలుత జరిగిన జీరో అవర్‌లో కౌన్సిలర్లు కరణం రాజకుమార్ నేతల హరిబాబు సీనియర్ కౌన్సిలర్ అవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్‌లు మాట్లాడుతూ సచివాలయం అధికారుల పనితీరు దారుణంగా మారిందన్నారు. దీర్ఘకాలిక సెలవులపై వెళ్తూ ఇష్టానుసారంగా వ్యవహరించ డంతో ప్రజల సమస్యలు పరిష్కారం కాకుండా ఇబ్బంది పడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. వీలైతే సచివాలయ సిబ్బందిని వార్డు వాలంటీర్లను పై వేరే వార్డులకు మార్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ ప్రతివార్డులను సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలపై తక్షణం స్పందించే విధంగా స్థానిక కౌన్సిల్ సభ్యులతో అనుసంధానం చేయాలని వారు కోరారు. సమావేశంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఆమోదించే అంశంపై గత రెండు సమావేశాల్లో వాటిపై వివరాలు కోరగా ఎందుకు వాటిని తెలపలేదని ప్రశ్నించారు. సమా వేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలను రికార్డ్ చేస్తున్నారా, లేదా, రికార్డు చేస్తే వాటిని చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. వార్డుల్లో పారిశుధ్య కార్మికుల విధులు విషయమై కౌన్సిలర్లు సేపేని సురేష్ ప్రశ్నించారు. తమ వార్డులో మహిళలకు సంబంధించిన మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని ఎప్పటికి పరిష్కరిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ కృష్ణమూర్తి, కౌన్సిలర్ రెడ్నం సునీతలు కమిషనర్ ని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ, తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు మాట్లాడగా మున్సిపాల్ డీఈ హుస్సేన్, కమిషనర్ నయీమ్ అహ్మద్, అన్ని శాఖల అధికారులు, అందరు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దళిత వాడలను పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

-ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ముద్రగడ లేఖ

విశాలాంధ్ర - కిర్లంపూడి : జనాభా 300 పై బడిన దళిత వాడలను గుర్తించి ప్రత్యేక పంచాయతీలుగా తీర్చిదిద్దేలా ఆలోచన చేయమని మాజీ మంత్రి, ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. లేక సారాంశం ఇలా ఉంది. రాష్ట్రంలో దళితులకు మెరుగైన పద్ధతులలో పదవులు నేరుగా ఎవరి ప్రమేయం లేకుండా వారి పదవులకు వారే ఓటు వేసుకునే విధానంలో ఆలోచన చేయమని కోరుతున్నానని అన్నారు. అన్ని పదవులు కాకపోయినా పంచాయతీ స్థాయిలో ప్రెసిడెంట్, వార్డు మెంబర్లకు పూర్తి స్వేచ్ఛ ఇప్పించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న దళిత నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అమూల్యమైన సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు వెళితే బాగుంటుందని లేఖలో పేర్కొన్నారు.

స్ఫూర్తి ప్రదాత గుంటముక్కల అప్పారావు

విశాలాంధ్ర - కాకినాడ : రాజేంద్రనగర్ మండల పరిషత్ పాఠశాల మాజీ కరస్పాండెంట్, సీనియర్ నాయకులు కీ.శే. గుంటముక్కల అప్పారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక రాజేంద్రనగర్ ఎమ్పీపీ పాఠశాల ఆవరణలో నగర సీపీఐ నాయకులు నల్లా రామారావు అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథులుగా మాజీ కార్పోరేటర్ నక్కా చిట్టిబాబు, పాఠశాల పూర్వపు విద్యార్థులు బళ్ళా శ్రీనివాసరావు, గుత్తుల బలరాం, కదలి సత్యనారాయణ, వార్డు పెద్దలు బత్తుల ముత్యలింగం, కాలేపు ప్రసాదరావు, మరిదాపు నాగమణి, సూరంపూడి అప్పారావులు పాల్గొని మాట్లాడుతూ గుంటముక్కల అప్పారావు అందించిన సేవలు నేటి యువతకు ఆదర్శప్రాయులని అన్నారు. ఆయన జీవితమంతా ప్రజల కొరకు, వార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేసారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల లోని విద్యార్థులకు వారి కుమారులు కుమార్ వేగు, సోమశేఖర్‌లు పండ్లు, స్టేషనరీ ఐటమ్స్, స్వీట్ బాక్సులు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్ఎమ్ ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు నీరజ, కాలేపు సత్యనారాయణ, తిరుమల శ్రీనివాస్, సరోజ, నల్లా లెనిన్, జెట్టి వినయ్, అరుణసాయి శ్రీనివాస్, గంగాధర్, సత్యారావు, గుంటముక్కల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పదేళ్లు పెంచాలి

విశాలాంధ్ర - అమలాపురం : దళితుల పట్ల జగన్ మోహన్ రెడ్డి చూపిస్తున్న ప్రేమ నిజమైతే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మరో పదేళ్లు పెంచాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. పిసిసి అధ్యక్షుడు హోదాలో శనివారం జన్మస్థలమైన అమలాపురం వచ్చిన రుద్రరాజుకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా స్థానిక ముస్లిం షాదిఖానా భవనంలో పిసిసి అధ్యక్షుడు అభినందన కార్యక్రమంలో రుద్రరాజు మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్న కష్టాల్ని గుర్తు చేస్తూ నిప్పులు చెరిగారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ, కెబిఆర్ నాయుడు, ములపర్తి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సహకార శాఖ ఉద్యోగులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం పదవీ విరమణ చేసిన సహకార సంఘం కార్యదర్శి వెంకటరమణ, సంఘ ఉద్యోగి మామిళ్లపల్లి సత్యనారాయణలను సహకార సంఘం అధ్యక్షుడు చదలవాడ బాబి, సిఇఒ కట్టా రాజబాబు, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చదలవాడ బాబి, రాజబాబులు మాట్లాడుతూ విధి నిర్వహణలో రైతులకు, ఖాతాదారులకు వెలగా వెంకటరమణ, మామిళ్లపల్లి సత్తిబాబు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. సన్మాన గ్రహీత వెలగా వెంకటరమణ, మామిళ్లపల్లి సత్యన్నారాయణ మాట్లాడుతూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆశీస్సులు, రైతులు సహకారంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ, సత్తిబాబులకు సొసైటి సిబ్బంది శాలువాలు కప్పి పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పివి కుక్కుటేశ్వరరావు, చీఫ్ మేనేజర్ ఎస్ అప్పలనాయుడు, సూపర్వైజర్ కొండబాబు, సిబ్బంది దొడ్డిపట్ల నారాయణరావు, పెదిరెడ్డి వీరబాబు, పోలిమేరు సత్తిబాబు, గౌతు మూర్తి, ఆళ్ల విజయకుమార్, రాజునాల వీరబాబు, దొడ్డి త్రినాథ్, ముద్రగడ బాబ్జి, కర్రి సురేష్, పెదిరెడ్డి మణిబాబు, కుమార్ ఎంపిటిసి రాపేటి ప్రసాద్, వార్డు సభ్యులు కురుమళ్ళ చిన్న పలువురు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్లో పోయిన సొమ్ములు తిరిగి వచ్చేశాయ్

సైబర్ క్రైమ్, టోల్ ఫ్రీ ఫిర్యాదుల ఫలితం

విశాలాంధ్ర - కాట్రేనికోన : ప్రజలు సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు దురదృష్టవశాత్తు తమ బ్యాంక్ అకౌంట్‌లోని సొమ్ములు పోతే ఉదాసీనంగా వదిలేయకుండా సకాలంలో ఫిర్యాదు చేస్తే సొమ్ములు తిరిగి వస్తాయనిడానికి ఇటీవల కాట్రేనికోనలో జరిగిన రెండు సంఘటనలే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. స్థానిక బత్తిన సుబ్బారావు కాలనీకి చెందిన ట్రైలర్ బొక్క శ్రీనివాస రావు ఎస్బిఐ అకౌంట్ నుండి ద్వాక్రా సొమ్ము వేస్తామంటూ సైబర్ దొంగలు ఓటిపి అడిగి ఈ ఏడాది నవంబర్ 23వ తేదీన 24,876వేల రూపాయలు కాజేశారు. వెంటనే అప్రమత్తమైన శ్రీనివాస రావు ఎస్బిఐ బ్యాంకు టోల్ ఫ్రీ నెంబర్, సైబర్ క్రైమ్ 1930లకు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులు మోసాన్ని గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. పోయిన సొమ్మును బాధితుడు శ్రీనివాసరావు ఎస్బిఐ అకౌంట్‌లోకి తిరిగి జమ చేయడంతో పోయిందనుకున్న సొమ్ము తిరిగి రావడంతో అతను ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. స్థానికుడు రవీంద్రనాథ్‌కు చెందిన పేటీఎం బ్యాంకు అకౌంట్ నుండి అక్టోబర్ 25వ తేదీన ఏడుదపాలుగా మొత్తం తొమ్మిది వేల రూపాయలు ఓటీపీలు రాకుండానే సునాయాసంగా సైబర్ దొంగలు సొమ్ము తరలించడంతో అతను నేషనల్ సైబర్ క్రైమ్ ఆన్లైన్ పోర్టల్‌లో నూ, పేటీఎం బ్యాంకుకు ఫిర్యాదులు చేశాడు. ఈ నేపథ్యంలో డిసెంబర్14 తేదీన సొమ్ము తిరిగి ఎకౌంట్లో జమ అయ్యింది. సొమ్ములు పోయాయని బాధపడుతూ ఊరుకోకుండా ఇలా ఫిర్యాదులు చేస్తున్న వారికి సకాలంలో సొమ్మును తిరిగి వాపసు చేస్తుండడంతో ఖాతాదారుల్లో ధీమా వ్యక్తం అవడంతో పాటు బ్యాంకులు పై నమ్మకం కూడా పెరుగుతోంది.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

వికాస కార్యాలయంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర -కాకినాడ : వికాస, కాకినాడ ప్రభుత్వాసుపత్రి వారి ఆధ్వర్యంలో వికాస కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రారంభించారు. కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హేమలత పర్యవేక్షణలో జిజిహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి. శారదాదేవి సహకారంతో సుమారు 45 మంది రక్తదానం చేశారు. "వికాస" ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం శిబిరం "వికాస" ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందుకు ఈ శిబిరంలో తమ ట్రైనింగ్ సెంటర్ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఇలాంటి కార్యక్రమాలు వికాస నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక సేవ చేయాలనే దృక్పథం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం రక్తదాతలకు జిజిహెచ్ సూపరింటెండ్ డాక్టర్ హేమలత, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జీజీహెచ్ సిబ్బంది, వికాస మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నైతిక విలువలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర- దేవరపల్లి : మండల మానవతా యూనిట్ ఆధ్వర్యంలో చిన్నాయిగూడెం జడ్పీ హై స్కూల్ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, నైతిక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్.ఎం. వి. శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్యఅతిథి మానవత స్వచ్ఛంద సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి, తణుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ బోయపాటి రామలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు విలువలతో కూడిన విద్యపై నే ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు పాటించవలసిన నియమాలు వివరించారు. మానవతా చైర్మన్ బలుసు సత్యనారాయణ, హైస్కూల్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాక బహుమతులు అందజేశారు. సర్టిఫికెట్లు, మెమెంటోలు, ఫైల్స్, గ్రామర్ బుక్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవతా వైస్ చైర్మన్ పప్పు వెంకట రామారావు, మానవత సభ్యులు ఆచంట సుభాష్ చంద్రబోస్, ఆచంట రాంబాబు, వెలిశెట్టి సూర్యనారాయణ, స్కూలు ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వేలంగి గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్ రూపొందిం చిన అంబేద్కర్ క్యాలెండర్‌ను మండల అధ్యక్షురాలు పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించినట్టు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ భీమ్ శంకర్రావు, ఆర్ఐ మాచర్లరావు, కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్, మాత అప్పారావు, సాదే వీరరాఘవులు, బూసి సత్యనారాయణ, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

27న లోకేష్ పాదయాత్ర

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్య లపై జనవరి 27న నారా లోకేష్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. స్థానిక పార్టీకార్యాలయంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ పాదయాత్రలో నిరుద్యోగ యువతను లోకేష్ స్వయంగా కలుసుకోవడంతో పాటు వారి సమస్యలపై చర్చిస్తారన్నారు. గతంలో టీడీపీ అధికారంలో వున్న సమయంలో నిరుద్యోగ యువతకోసం అప్పటి సీఎం చంద్రబాబు ముందస్తు ప్రణాళికతో ఐటి రంగాన్ని అభివృద్ధిచేయడంతో పాటు, ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుతో పాటు అనేక సంస్థలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు, వివై దాసు, నృసింహదేవర విశ్వనాథం, వమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, మల్లిపూడి వీరు, బంగారు సత్యనారాయణ, కొల్లాబత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నార్కెడ్ మిల్లిలో హౌసింగ్ డే

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో హౌసింగ్ డే సందర్భంగా ఆత్రేయపురం మండలం నార్కెడ్‌మిల్లి జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో ఆత్రేయపురం మండల ప్రత్యేక అధికారి ఎంవి రామారావు, ఎంపీడీఓ నాతి బుజ్జి, గ్రామ సర్పంచి పాలా నాగేశ్వరరావు సమావేశం నిర్వహించి, గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. లే అవుట్‌లో గృహాలు మంజూరు అయ్యి, ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని అన్నారు. ఇప్పటికే గృహాలు నిర్మించుకొని, నివాసం ఉంటున్న వారి గృహాలను చూపించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, ఏపీయం అప్పలకొండ, స్థానిక ఎంపీటీసీ పాలా చిన్న వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో ఉదయ్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - పెదపూడి : నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రతి ఇంటికి కుళాయి కనక్షన్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేంద్ర గ్రామంలో శనివారం జలజీవన్ మిషన్ నిధులు రూ.29.54 లక్షలతో ప్రతి ఇంటికి కుళాయి కనక్షన్, సంపర గ్రామంలో నాడు నేడు పథకంలో రూ.41.75 లక్షలతో చేపట్టే పాఠశాల భవనం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారా యణరెడ్డి. మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు వేసవిలో తాగునీరు ఎద్దడిలేకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి ప్రజలకు తాగునీరు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం పురపాలక సంఘం

షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి. నెం.216/2022, ఇ1 తేది. 31.12.2022.

పెద్దాపురం పురపాలక సంఘ పట్టణ పరిధిలో వివిధ గ్రాంటులు మరియు జనరల్ నిధులతో చేపట్టు పనులకు థర్డ్ పార్టీ వారిచే సర్టిఫై చేయుట మరియు మెటీరియల్ చెకింగ్ కొరకు సీల్డ్ టెండర్లు కోరడమైనది. **ది.07-01.2023వ తేది సాయంత్రం 4.00 గం.ల** వరకు టెండర్లు స్వీకరించబడి అదే రోజు సాయంగ్రం గం. 4.30లకు హాజరు అయిన కాంట్రాక్టర్ల సమక్షంలో కమిషనర్ వారు గాని వారి అనుమతి పొందిన వేరొక అధికారి వారిచే గాని టెండర్లు తెరువబడును. టెండర్ సమయము మార్చుటకు, లేక టెండర్ రద్దు చేయుటకు కమిషనర్ వారికి పూర్తి అధికారి కలదు. కాంట్రాక్టర్ టెండర్ డిపాజిట్ డిమాండ్ డ్రాఫ్ట్ రూపములో కానీ, ఈ కార్యాలయం ట్రెజరీ నందు గాని నిర్ణీత సమయములో కమిషనర్, పెద్దాపురం పురపాలక సంఘం వారి పేరు మీద తీసి, షెడ్యూల్‌నకు జతచేసి టెండర్ దాఖలు పర్చవలెను. సక్రమముగా లేని టెండర్ షెడ్యూల్ పరిగణలోనికి తీసుకొనబడవు.

ఇతర వివరములకు ఆఫీసు పనివేళల యందు కమిషనర్ వారిని గాని లేక సంబంధిత సిబ్బందిని గాని సంప్రదించవలెను.

టెండర్ షెడ్యూల్‌నకు రుసుము చెల్లించుటకు ఆఖరు తేది : 04-01-2023
టెండర్ దారావత్తు చెల్లించుటకు ఆఖరు తేది : 05-01-2023
టెండర్ షెడ్యూల్ జారీచేయు తేది : 06-01-2023
టెండర్ దాఖలు చేయు తేది : 07-01-2023

వ.నెం	పనివివరము	షెడ్యూల్ ఖరీదు
1	పెద్దాపురం పురపాలక సంఘ పట్టణ పరిధిలో జరుగు సివిల్ పనులకు గాని థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ వారిచే సర్టిఫై చేయుట మరియు మెటీరియల్ చెకింగ్ కొరకు (క్వాలిఫైడ్ లేబరేటరీస్ వారు మాత్రమే)	రూ.1,000/-

కమిషనర్, పెద్దాపురం పురపాలక సంఘం